క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా జాన్



జాన్‌ను అభినందిస్తున్న గ్రామ కమిటీ సభ్యులు

యలమంచిలి: వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యునిగా ఏనుగువానిలంక గ్రామానికి చెందిన ఉల్లంపర్తి జాన్‌ను ఎంపిక చేశారు. ఆదివారం గ్రామ పార్టీ నాయకులు జాన్‌ను కలిసి శాలువతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో మల్లుల కొండలరావు, పాలపర్తి సందీప్, కాకుమళ్ల ఆంజనేయులు, దిడ్ల విజయకుమార్, బొమ్మిడి నాగరాజు, పాలపర్తి స్వర్ణనరాజు, గొలికారి తాతాజీ, దిడ్ల రాజబాబు, కొ్ట్ర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దంచి కొట్టిన వాన

నరసాపురం రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో గత రెండు రోజులుగా తీరంలో ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రోడ్లన్నీ జలమయయ్యాయి. ఆదివారం సుమారు 25.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షం ప్రభావంతో లోతట్టు ప్రాంతాల్లోని నివాసాల మధ్య వర్షం నీరు నిలిచిపోవడంతో పాటు మొగల్తూరు కోట రోడ్డు, పడమటిపాలెం రోడ్డు, కాశీపట్నం పడమర–కృష్ణా జిల్లా గొల్ల పాలెం రహదారితో పాటు కెపిపాలెం, పేరుపాలెం, మొగల్తూరు కొండావారిపాలెం, రాజ్యలక్ష్మి అమ్మవారి కాలనీ, శేరేపాలెం, పాతపాడుల్లోని ఇందిరమ్మ లేఅవుట్ కాలనీలు ముంపులో ఉన్నాయి.

కాలువ రేవులు అధ్వానం



సిద్ధాంతం కేదారీఘాట్ రేవులో నిరసన వ్యక్తం చేస్తున్న శివమాలధారులు



రేవులో అమ్మవారు, గణపతి విగ్రహ వ్యర్థాలు

పెనుగొండ కేదారీఘాట్‌లో మాలధారుల అవస్థలు

పెనుగొండ: దక్షిణ కాశీగా పేరు గాంచిన సిద్ధాంతం కేదారీఘాట్ రేవుల దుస్థితితో శివ.. శివా స్నానం చేసేది ఎలా? అంటూ శివస్వాములు, అయ్యప్ప మాలధారులు గగ్గోలు పెడుతున్నారు. గోదావరి పెరుగుతూ తగ్గుతూ ఉండడంతో బురద పేరుకుపోవడంతో పాటు, ఇటీవలే గణపతి నవరాత్రులు, దేవీ నవరాత్రులు ముగియడంతో ఆయా విగ్రహాల నిమజ్జనాలతో వ్యర్థాలతో రేవులన్నీ పూర్తిగా నిండిపోయాయి. దీంతో స్నానాలు చేయడానికి హడలిపోతున్నా మాలధారులు ఆదివారం రేవుల వద్ద నిరశన వ్యక్తం చేశారు. కేదారీ ఘాట్‌లో మూడు పుష్కర రేవులు ఉన్నాయి. వీటిలో ఒకదానిని పిండ ప్రధానాల రేవుగా వినియోగించుకుంటుంటారు.

నిత్యం రద్దీ

కేదారేశ్వరుడు కొలువై గోదావరీ తీరం పవిత్ర స్థలంగా పేరు గాంచడంతో నిత్యం భక్తులు భారీగా పుణ్య స్నానాలకు వస్తుంటారు, అదేవిధంగా పరిసర గ్రామాల నుంచి అంత్య క్రియలకు మృత దేహాలను తీసుకు వచ్చి ఆఖరి మజిలికి దక్షిణ కాశీ శ్మశాన వాటికను వినియోగించుకుంటుంటారు. వీరి వెంట వచ్చే వారందరూ స్నానాలు ఆచరిస్తుంటారు. అదేవిధంగా అపరకర్మలను సైతం కేదారీఘాట్ వద్ద నిర్వహిస్తారు. నిత్యం రెండు నుంచి మూడు మృత దేహాలు అంత్యక్రియలకు వస్తాయి. వాటి కూడా కనీసం 200 లకు పైగా బందుమిత్రులు వస్తుంటారు. వీరంతా ఇదే రేవుల్లో స్నానాలు చేస్తారు. అయితే, గత రెండు మూడు నెలలుగా గోదావరికి వరద వస్తుండడం, తగ్గుతుండడంతో వరద నీటితో పాటు వచ్చే బురద రేవుల్లో నిలిచిపోయింది. దీంతో బురదలో స్నానాలు చేయడానికి రేవుల్లో దిగుతూ జారి పడిపోతున్నారు. అదేవిధంగా, గణపతి, దేవీ నవరాత్రులు పూర్తి కావడంతో పరిసర గ్రామాల నుంచి పదుల సంఖ్యలో ప్రతిమలను తీసుకు వచ్చి కేదారీఘాట్ పుష్కర రేవుల్లో నిమజ్జనం చేశారు. వీటి వ్యర్థాలతో రేవులన్నీ నిండిపోయాయి. ఇనుప ఊచలు, గెడ బద్దలతో పాటు, పీఓపీ వ్యర్థాలు రేవుల్లోనే ఉండిపోయాయి. దీంతో స్నానాలకు వచ్చిన వారు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా గాయాలు పాలవుతున్నారు.

కార్తీకం మరింత దుర్భరం

ఇదిలాఉండగా బుధవారంనుంచి కార్తీక మాసం ప్రారంభం కానుండడంతో మహిళలు వందల సంఖ్యలో కార్తీక స్నానాలు ఆచరించడానికి వస్తారు. చీకటిలో మహిళలు పుణ్యస్నానాలు చేయడం దుర్భరంగా మారుతుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కేదారీఘాట్ రేవులను శుభ్రపరచాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

రామేశ్వర స్వామి ఆలయంలో కార్తీక ఉత్సవాలు

పెనుగొండ: పవిత్ర కార్తీక మాసం సందర్భంగా ఆచంటలో ప్రసిద్ధి చెందిన రామేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాస ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ నెక్కంటి గణేశ్వరరావు, కార్యనిర్వహణాధికారి ఆదిమూలం వెంకట సత్యనారాయణలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం

యలమంచిలి: విశ్వ మానవత సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక తమ్మినీడి ఉమా నరసింహ కళ్యాణ మండపంలో ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహించారు. హోమియో వైద్యులు డాక్టర్ శిరిగినీడి రమేష్, డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మిలు పేషెంట్లను పరీక్షలు చేసి హోమియో మాత్రలు అందజేశారు. తమ్మినీడి శ్రీనివాస్, శాంతమూర్తి, రాము, మూర్తి, రాంబాబు, సాయి కిరణ్ పాల్గొన్నారు.

లక్ష్యంతో పని చేయాలి

నరసాపురం రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా పార్టీలో ఉన్న ప్రతి కార్యకర్త, నాయకులు లక్ష్యంతో పని చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ఆదివారం మండలంలోని పసలదీవి గ్రామ కమిటీని నూతనంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు వారిని ఉద్దేశించి మాట్లాడారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కొట్టు ఏడుకొండలు, ప్రధాన కార్యదర్శులుగా గుబ్బల సింహాచలం, గుంపుల మోహనరావు, పులపర్తి నాగవీరవెంకట శ్రీనివాసరావు, కొట్టు ఏడుకొండలు, కార్యదర్శులుగా వడ్డి ఆంజనేయులు, దొంగ శ్రీనివాసరావు, గుంపుల సురేష్, గొట్టు వెంకట్రావు, (బూరి), కార్యవర్గ సభ్యులుగా కొట్టు ఏడుకొండలు, సూర్యారావు, వెంకటస్వామి, లక్కు త్రిమూర్తులు, గుంపుల జయరాజు, గుత్తుల వెంకన్నబాబు, పులపర్తి ఆంజనేయులు, నక్కా ఏసుబాబు, రావూరివెంకట్రావు, యూత్ విభాగం అధ్యక్షుడిగా గుత్తుల సురేష్, రైతు విభాగం కొట్టు వెంకట్రావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా గుంపుల సురేష్, బీసీ సెల్ అధ్యక్షుడిగా గుత్తుల శంకర్రావు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా గుంపుల మహాలక్ష్మి, మేథావుల ఫోరం అధ్యక్షుడిగా భీమనాథుని వెంకట సత్యనారాయణ లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు ఉంగరాల రమేష్‌నాయుడు, మైలాబత్తుల సోని, బొక్కా రాధాకృష్ణ, దొండపాటి వెంకట్, ఒడుగు సత్యనారాయన, పులపర్తి ప్రతాప్, మైలాబత్తుల శ్రీను, అడ్డాల నర్సింహరావు, కంకటాల పెద్దిరాజు, హేన్లీ, మల్లుల సత్యనారాయణ, పులపర్తి త్రిమూర్తులు తదితరులు ఉన్నారు.

క్షీరారామలింగేశ్వర సేవా సమితి సమావేశం



కాషాయ జెండాలను ఆవిష్కరిస్తున్న క్షీరారామలింగేశ్వర సేవాసమితి సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయానికి కార్తీకమాసంలో వచ్చే భక్తులకు స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో పాలు, ప్రసాదం, శివాలయాల సందర్శనపై సమావేశం ఏర్పాటు చేశారు. ఆదివారం స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో అభిషేక మండపంలో నిర్వహించిన సమావేశంలో సేవా సమితి అధ్యక్షులు శీరం ఆనందకృష్ణ మాట్లాడుతూ కార్తీక సోమవారాలు ఆలయానికి వచ్చే భక్తులకు పాలు పంపిణీ నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ఈ సంవత్సరం యలమంచిలి మండలం, పోడూరు మండలంలో ఉన్న శివాలయాలు దర్శించుకునే విధంగాఏర్పాటు చేశామన్నారు. అలాగే కార్తీకమాసం ప్రారంభంలో ఆలయంపై, పట్టణంలో ఏర్పాటు చేయనున్న కాషాయ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ నూతన చైర్మన్ మీసాల రామచంద్రరావును సేవా సమితి ఆధ్వర్యంలో శాలువతో సత్కరించారు. జక్కంపూడి కుమార్, కొప్పల శ్రీనివాసు, సర్వశుద్ధి నాగేశ్వరరావు, సోమేశ్వరరావు, చెరుకూరి శ్రీనివాస్, శేఖర్, శ్రీనివాస్, బాకూరి నిరంజన్, యలమర్తి నారాయణ, ఏలూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మంత్రి అచ్చన్న నోరు అదుపులో పెట్టుకోవాలి



ఉచ్చుల స్టాలిన్

యలమంచిలి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు అహంకారానికి నిదర్శనమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్ బాబు విమర్శించారు. శనివారం పాలకొల్లు వ్యవసాయమార్కెట్ కమిటీ ప్రమాణస్వీకార మహోత్సవంలో మాట్లాడిన మాటలను తీవ్రంగా ఖండించారు. స్టాలిన్ మాట్లాడుతూ 18 ఏళ్లు దాటిన ప్రతీ మహిళకు నెలకు రూ. 1500 ఇస్తామని దొంగ హామీ ఇచ్చి ఇప్పుడు ఈ పథకం అమలు చేస్తే రాష్ట్రం అమ్మాలని మాట్లాడిన మంత్రి అచ్చెన్నాయుడుకి జగనన్నను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. ఆడబిడ్డ నిధి అమలుపై మంత్రి మహిళకు సమాధానం చెప్పాలన్నారు. లేకపోతే 2029లో అదే మహిళలు ఎన్ని వేల అడుగుల గొయ్యి తీసి మీ కూటమి పార్టీలను పాతేస్తారో అంతుచిక్కదన్నారు.

అధికార మదంతో దాడులు

పెనుగొండ: చంద్రబాబు అధికారంలోకి రావడానికి కారణమైన ఎస్సీ, బీసీ, కాపు సామాజిక వర్గాలపైనే అధికార మదంతో దాడులు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు సుంకర సీతారాం ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కందుకూరు మండలం దొరకానిపాడులో టీడీపీ నేత చేతిలో హత్యకు గురైన కాపు యువకుడు తిరుమలశెట్టి లక్ష్మీనాయుడు కుటుంబానికి కోటి నష్ట పరిహారం అందించి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు అధికారంలోకి రావడానికి ప్రధాన ప్రాత పోషించిన జనసేన పార్టీకి ఏకపక్షంగా మద్దతు పలికిన కాపు సామాజిక వర్గంపై దాడులు జరుగుతున్నా పవన్ కల్యాణ్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.